క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన రమేష్ గత నెలలో ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతి చెందడంతో ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ సభ్యులు రూ.2.45 లక్షల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మొక్కల పంపిణీ



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్‌లో శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పండ్ల మొక్కలను అందజేశారు. ఏపీవో విద్యానంద్, కార్యదర్శి శ్రీనివాస్, ఐకేపీ సీసీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అవగాహన

బాల్కొండ: ముప్కాల్ మండలం నాంపేట్ గ్రామంలో ఈవీఎంలపై ఆర్ఐ గంగాధర్ ఆధ్వ ర్యంలో శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పిం చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లు పనిచేసే తీరును వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం నమోదు చేసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగవ్వ, ఎంపీటీసీ మోహన్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విజయం కోసం కృషి చేయాలి



వర్ని: కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రతాప్ సింగ్ పిలుపు ఇచ్చారు. చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికి టికెట్ వచ్చినా అందరు కలిసికట్టుగా అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, కునిపూర్ రాజారెడ్డి , లక్ష్మణ్, శ్రీనివాస్, సురేష్ బాబా తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి



ఆర్మూర్‌టౌన్: ప్రతిఒక్కరు మొక్కలను నాటాలని ఆర్మూర్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోపి కృష్ణ అన్నారు. స్థానిక రాంనగర్‌లో ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి తులసి, జైత్ర, అంకం, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయం చేయాలి



ఆర్మూర్‌టౌన్: సమస్యలపై పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలకు న్యాయం చేయాలని ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన జగదీస్‌చందర్‌ను సామాజిక సేవకుడు పట్వారి తులసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిపి జ్ఞాపికను అందజేశారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఆర్మూర్‌టౌన్: మీమన్‌పల్లి గిరిజన గురుకుల (బాలుర) కళాశాలలో ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో చేరాలనుకునే వారు 31న ఉదయం కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ జైలని ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 17 సీట్లు, బైపీసీలో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అదేవిధంగా ఆలూర్‌లోని మైనారిటీ బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీలో 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సయ్యద్‌హైదర్ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

కమ్మర్‌పల్లి: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణమే ఎకరానికి రూ. 20 వేలు నష్టపరిహారం చెల్లించాలని పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కమ్మర్‌పల్లిలో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధులు విడుదల చేయించాలని కోరారు. నాయకులు సుంకేట రవి, బుచ్చి మల్లయ్య, గణేష్ గౌడ్, పత్తిరి రవి, తక్కురి శేఖర్, సుంకేట శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరద తిప్పలు

- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- రైతుల ఇబ్బందులను తెలుసుకున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు
- నీట మునిగిన పొలాలను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు



దొంకేశ్వర్: తొండాకూర్‌లో వరి పొలంలో ఇసుక మేటలు

సాక్షి, నెట్‌వర్క్: వర్షం కారణంగా జిల్లా వ్యాప్తంగా అపార నష్టం కల్గింది. పంట పొలాలు నీట మునిగాయి. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు ధ్వంసం కావడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆర్మూర్, ఆలూర్, మాక్లూర్ తదితర ప్రాంతాల్లో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. నవీపేట మండలంలోని జన్నెపల్లి, నాళేశ్వర్ మాటు కాలువల కింద నీట మునిగిన పంట పొలాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.మోహన్‌రెడ్డి, భీమ్‌గల్ మండలం కప్పలవాగు కింద నాసిరకంగా చెక్ డ్యాం నిర్మించడం వల్ల తెగి వంద ఎకరాల్లో పంట దెబ్బతిన్న ప్రాంతాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పరిశీలించారు. వేల్పూర్ మండలంలో వైస్ ఎంపీపీ బోజపల్లి సురేష్, ఏవో నర్సయ్య, సర్పంచ్ తీగెల రాధామోహన్ పొలాలను పరిశీలించి రైతులతో మాట్లడారు. ఆర్మూర్ మండలంలో 1,950 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఏవో హరికృష్ణ తెలిపారు. ముప్కాల్ మండలంలో ఏవో రాజుకుమార్ పంటలను పరిశీలించారు. కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్, కొత్త చెరువు తాండల మధ్య ఉన్న రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

బోధన్: మండలంలో 1,600 ఎకరాల్లో, జన్నేపల్లి, సిరాన్ పల్లి, నిజాంపూర్, లింగాపూర్, నాలేశ్వరం గ్రామాల్లో 200, రెంజల్, నీలా, సాటాపూర్, కందకుర్తిలో 2 వేల ఎకరాలు, ఎడపల్లి మండలంలో దాదాపు 200 ఎకరాల్లో పంట నీట మునిగింది.



భీమ్‌గల్: పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



నవీపేట: లింగాపూర్ పొలాలను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రెడ్డి



పిప్రి, మంథని గ్రామాల మధ్య వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



కమ్మర్‌పల్లి: కోతకు గురైన కొత్త చెరువు తండాలో పొలాల దుస్థితి



కుద్వాన్‌పూర్‌లో ఏవో జ్యోత్స్న..



రుద్రూర్: చిక్కడపల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



భీమ్‌గల్‌లో పంటలను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి



వేల్పూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఎంపీపీ భీమ జమున, ఏవో నర్సయ్య



ఆర్మూర్: ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద వరద నీటిలో కొనసాగుతున్న రాకపోకలు



ముప్కాల్: వెంచిర్యాల్‌లో ఏవో రాజుకుమార్

ప్రారంభానికి ముందే లీకేజీ..



కమ్యూనిటీ హాల్‌లో లీకేజీ అవుతున్న వర్షపు నీరు

నవీపేట: మండలంలోని పోతంగల్‌లో రూ. 2 కోట్లతో నిర్మించిన బహుళార్థ సాధక కమ్యూనిటీ హాల్ ప్రారంభానికి ముందే లీకేజీ అవుతోంది. బహుళార్థ సాధక కమ్యూనిటీ హాల్, పాఠశాల భవనం, గ్రంథాలయం, అదనపు గదులను నిర్మించారు. నాసిరకంగా పనులు చేపట్టారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. త్వరలో ఎమ్మెల్సీ కవితచే ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఆలోగా వర్షాలకు లీకేజీ కావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలు నివారించేందుకు పైకప్పు భాగంలో తిరిగి పనులు చేయిస్తామని పంచాయతీరాజ్ ఏఈ శ్రావణ్ తెలిపారు.

ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావాలి



మేనేజర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్మూర్ డిపోను లాభాల్లోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రవిచందర్, గోపి జనార్ధన్, విట్టల్ జగదీష్, వేల్పూర్ గంగాధర్, పోచయ్య, శీను, ప్రతాప్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు విధించడం సరికాదు



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలపై ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక బాలుర జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం పీడీఎస్‌యూ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలు బహిర్గతం చేస్తున్నారనే అక్కసుతో వారికి అక్కడికి వెళ్లేందుకు నిషేధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి నిఖిల్,ఉపాధ్యక్షుడు నవీన్, శ్రీకాంత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యాన్ని సాధించాలి



రుద్రూర్: కోటగిరి ఉమ్మడి మండలంలో నిర్దేశించిన హరితహారం లక్ష్యాన్ని చేరుకోవాలని డీఆర్‌డీవో చందర్ నాయక్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతలు పరిశీలించారు. అనంతరం కోటగిరి, పోతంగల్ మండలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మనోహర్ రెడ్డి ఉన్నారు.

మరింత కష్టపడి చదవాలి



నవీపేట: పదో తరగతిలో 10కి 10 గ్రేడ్ సాధించిన నవీపేటకు చెందిన హర్షవర్ధన్‌ను బీజేవైఎం నాయకులు శుక్రవారం సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ద్యాగస రిన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్, నాయకులు భాను, రాము, లక్ష్మన్, రాజేందర్‌గౌడ్, సాయి పాల్గొన్నారు.

మండలాల్లో మంత్రి పర్యటన



ఏర్గట్లలో వాగును పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్ : వర్షాలవల్ల నీట మునిగిన పంట పొలాలు, ముంపునకు గురైన ప్రాంతాలను శుక్రవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లోని వివిధ గ్రామాల్లో మంత్రి పర్యటించారు. కోతకు గురైన రోడ్లు, చెరువుల కట్టలను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, సర్పంచ్ గుల్లె లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ మధు, పార్టీ మండల అధ్యక్షుడు రాజాపూర్ణనందం, సహకార సంఘాలు ఛైర్మన్‌లు పెద్దకాపు శ్రీనివాస్, బర్మ చిన్న నర్సయ్య తదితరులున్నారు.

బోటింగ్ ఏర్పాటు చేయాలి



గుండ్ల చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్: గుండ్ల చెరువులో పర్యటకుల కోసం బోటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మున్సిపల్ అధికారులు సూచించారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు యొక్క అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్, మున్సిపల్ కమిషనర్ చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాదాచారుల కోసం వాకింగ్, సైక్లింగ్ ట్రాక్, చెరువు చుట్టూ గణేష్ నిమజ్జనం వీక్షించడానికి వచ్చే పర్యాటకుల కోసం ఫూట్ పాత్ ఏర్పాటుచేయాలన్నారు. అలాగే వాహనదారులకోసం పార్కింగ్ ఏరియా, స్టాళ్ల , బతుకమ్మ ఘాట్ అన్ని వసతులు, పర్యాటకుల కోసం మరుగుదొడ్ల ఏర్పాటుచేయలన్నారు. రానున్న రోజుల్లో చెరువు మధ్యలో ఉండే స్థలాన్ని 'ఐలాండ్' గా అభివృద్ధి చేసి అక్కడ పర్యాటకుల కోసం వసతిగృహాలను ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



హంగర్గాలో బ్యాక్ వాటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

బోధన్ రూరల్ (బోధన్): నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో బోధన్, సాలురా మండలంలోని మంజీర తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. మండలంలోని హంగర్గ గ్రామంలో బ్యాక్ వాటర్‌ను తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ పర్బన్నలతో కలిసి ఆయన పరిశీలించారు. వరద కొనసాగుతున్నందున శ్రీరామ్ సాగర్ లోకి లక్ష క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని దీంతో ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్‌తో శివారు ప్రాంతంలో పంటలు నీట మునిగాయని గ్రామస్థులు ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. రైతుల కోరిక మేరకు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఎస్ఈకి ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ శరత్, ఏఎంసీ వైస్ ఛైర్మెన్ షకీల్, నాయకులు బుద్దె రాజేశ్వర్, సంజీవ్ కుమార్, జి.నర్సయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

బోధన్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు శుక్రవారం పట్టణ కేంద్రంలో ఆర్డీవో రాజాగౌడ్ కు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల ప్రతినిధులు వినతి పత్రం అందించారు.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో శారీరక, బహుళ వైకల్యం కలిగిన వారికి అమలు అవుతున్న రిజర్వేషన్ రోస్టర్ పాయింట్ 10 లోపు తగ్గించేవిధంగా జీవో ను సవరించాలని పేర్కొన్నారు. దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, సొంత స్థలం ఉన్నవారికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. వేదిక మండల అధ్యక్షుడు గైని రాములు, ప్రతినిధులు దత్తు, సాయిలు, సాయినాథ్, రాజు పాల్గొన్నారు.

సమ్మెలో కార్మికులు.. సమస్యల్లో పంచాయతీలు



మోర్తాడ్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు



బోధన్‌లో..

మోర్తాడ్: ఉద్యోగ భద్రత, వేతనాల పెంపుదల తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు 23 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. పారిశుధ్య పనులు చేసేవారు లేక సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. సమ్మె కారణంగా పంచాయతీల్లో వివిధ సమస్యలు నెలకొన్నాయి.

బోధన్‌రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. యేశాల గంగాధర్, సాగర్, సతీష్, లక్ష్మీ, గౌతమ్ పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రమైన వర్నిలో కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని కార్మికులు బుడ్డక సాయిలు, సాయి చరణ్, గంగారం, రాజు, ఉస్మాన్ పేర్కొన్నారు.

రుద్రూర్: రుద్రూర్‌లో సమ్మె చేస్తున్న కార్మికులకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నూర్జాహన్, వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి మచ్చూరి అశోక్, నాయకులు శ్రీకాంత్, నర్సింలు, కృష్ణ, సాయిలు పాల్గొన్నారు.

వర్ని(మోస్రా): మోస్రాలో ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు కార్మికులకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

నిరాశ్రయులకు అండగా..



కమ్మర్‌పల్లిలో బాధితులకు అన్నదానం చేస్తున్న శివాజీ యువసేన సభ్యులు



పోతంగల్‌లో నగదు ఇస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

సాక్షి, నెట్‌వర్క్: వర్షాల కారణంగా నిరాశ్రయులైన వారికి కమ్మర్‌పల్లిలో శివాజీ మహారాజ్ యువసేన సభ్యులు ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఆర్మూర్ లోతట్టు ప్రాంతాల ప్రజలకు జీవన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రె డ్డి ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. నవీపేట మండలం పోతంగల్‌లో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ ఆర్థిక సహాయం అందించారు. పిప్రి గ్రామంలో పలువురు బాధితులకు కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ సూచనల మేరకు ఆ పార్టీ నాయకులు సరుకులు పంపిణీ చేశారు.



బోధన్‌లోని చక్కెరనగర్‌లో సరుకుల పంపిణీ

ఇసుక మేటలే మిగిలాయి..

బాల్కొండ: భారీ వర్షం కారణంగా పంట పొలాల్లో ఇసుక మేటలు కన్పిస్తున్నాయి. చెరువుల అలుగులను కొట్టేయడం, వర్షాలతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించడంతో ఆ నీరు అంత కూడ పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో పంట భూముల్లో ఒడ్డు, ఒరం లేకుండ పెద్ద పెద్ద గండ్లు ఏర్పాడ్డాయి. పసుపు, సోయా, మక్క పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇసుక మేటలను తొలగించడం కష్టమని రైతులు పేర్కొంటున్నారు.

చెక్కుల పంపిణీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రెండవ వార్డుకు చెందిన రాజ్‌కౌర్, బండారి సునీత, దండుగుల సుశీలకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను కౌన్సిలర్ ఖాందేష్ సంగీత పంపిణీ చేశారు. నాయకులు ఖాందేష్ సత్యం, జాగృతి కన్వీనర్ మక్కల సాయినాథ్, బండారి నరేష్, మేతాబ్‌సింగ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన పలువురికి సర్పంచ్ ఇందూర్ సాయన్న సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 - హిడింబ - 11.00, 4.40, 10.20; హత్య (తెలుగు) - 1.55, 7.35
- స్క్రీన్-2 - బేబి (తెలుగు) - 11.45, 3.15, 6.45, 10.15
- స్క్రీన్-3 - ఓపెన్‌హ్యామర్ (ఇంగ్లీష్) - 10.00, 2.00, 6.00, 10.00
- స్క్రీన్-4 - బేబి(తెలుగు)-12.00; సామజవరగమన - 3.40; అన్నపూర్ణ ఫొటోస్టూడియో(తెలుగు)-6.40; మిషన్ ఇంపాజిబుల్ - 9.30